క్లుప్తంగా

డీఎస్పీని కలిసిన తలమడుగు ఎస్సై



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సై అంజమ్మ

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు ఎస్సైగా బి.అంజమ్మ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డిని జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని డీఎస్పీ సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో గుట్కా, మట్కా, గంజాయిలను రూపుమాపేలా విధులు నిర్వర్తించాలన్నారు.

శాంతియుత ధర్నాలో రిమ్స్ కార్మికులు



ధర్నాలో పాల్గొన్న రిమ్స్ కార్మికులు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఆదివారం చేపట్టిన శాంతియుత ధర్నాలో రిమ్స్ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ నుంచి వెళ్లిన వారిలో తిరుపతి, గంగాధర్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన పెంట జానకికు మంజూరైన రూ.28 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. బోథ్ వ్యవసాయ శాఖ ఉపాధ్యక్షుడు ఆడే వసంతరావు, బ్లాక్ అధ్యక్షుడు అల్లూరి ప్రఫుల్ చందర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, పోతారెడ్డి, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నభావు సాఠె జయంతి

ఆదిలాబాద్‌రూరల్: పట్టణంలోని రణదీవెనగర్ కాలనీలో భారతీయ సాహిత్య సామ్రాట్ డాక్టర్ అన్నభావు సాఠె 104వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు లోక ప్రవీణ్‌రెడ్డి సాఠె, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌రావు, మధుకర్, రాజ్‌కుమార్, ఇంతియాజ్, రాహుల్, రమకాంత్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన మున్నూరుకాపు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ఆదిబాద్‌రూరల్: మండలంలోని అంకోలి గ్రామ మున్నూరుకాపు యువజన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పూదరి రాహుల్, ఎర్రం రాహుల్, ఉద్యోగ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎర్రం ప్రభాకర్, సుంకరి హరిదాస్‌లు ఆదివారం ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని మున్నూరుకాపులు సన్మానించారు. గ్రామస్తులు ఎర్రం నర్సింగ్‌రావ్, కనక రమణ, చంద్రశేఖర్, కళ్యాణం కృష్ణ, నవీన్, నర్సింగ్, రాకేశ్, పొశెట్టి, సంటిబాపు, ఎర్రం అశోక్, స్వామి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన ఆనందపు రవి, సాకేర గ్రామానికి చెందిన జాదవ్ భారత్‌లు ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను ఎంపీ నగేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం ఆదివారం పరామర్శించారు. వారి వెంట నాయకులు ఉన్నారు.

- మండలంలోని పిప్పలధరి గ్రామానికి చెందిన ఆనంద్ ఇటీవల ఎలుగుబంటి దాడిలో గాయాలపాలయ్యాడు. ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆనంద్‌ను మాజీ సర్పంచ్ శ్రీధర్ ఆదివారం పరామర్శించారు.

'చెత్త'శుద్ధి ఏది?

ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వెనుకాల..





రవీంద్రనగర్‌లో..



టీటీడీ కళ్యాణమండపం ఎదురుగా



హౌజింగ్‌బోర్డు కాలనీలో

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ వైపు వార్డులను సందర్శిస్తూ ప్రజలు, అధికారులకు సూచిస్తున్నారు. మున్సిపల్ యంత్రాంగం మాత్రం తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. వారి నిర్లక్ష్యంతో జిల్లా చెత్త సేకరణ అస్తవ్యస్తంగా మారి పలు కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోతోంది. చెత్తపై చిత్తశుద్ధి లేకుండాపోతుంది. పట్టణంలోని ఆయా కాలనీలో రోడ్లపై వేసే చెత్త నుంచి దుర్గంధం వెదజల్లడంతో ముక్కు మూసుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్









ఘనంగా గోకులాష్టమి వేడుకలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ప్రైవేట్, ప్లేస్కూళ్లలో ఆదివారం ముందస్తుగా గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపిక కృష్ణుడి వేషాధారణలో అలరించారు. పాఠశాలల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. పండగ విశిష్టత గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

నూతన ఎన్నికల నిర్వహణ కమిటీ

ఆదిలాబాద్‌రూరల్: మాల సంక్షేమ సంఘం అడహక్ కమిటీ ఎన్నికల నిర్వహణలో విఫలం, కాలపరిమితి ముగియడంతో రద్దు చేస్తూ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆదివారం సంఘం భవనంలో జిల్లా, మండల, గ్రామ కార్యవర్గ సభ్యుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు నాయకులు తెలిపారు. అందరి అభిప్రాయం మేరకు నూతన ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్లుగా బొంకంటి సుభాష్, చిలుక చిన్నన్న, సభ్యులుగా వినోద్, ప్రకాశ్, భాస్కర్, క్రాంతి, సత్యనారాయణ, రవి, విశ్వనాథ్, దయాకర్, వై భూమన్న, ఎం భూమన్న, స్వామి, ఆశన్న ఎన్నికయ్యారు.

అంగన్‌వాడీల్లో నాసిరకం సరుకులు



రంగు మారిన పసుపు



రంగు మారిన కారం

బేల: అంగన్‌వాడీల్లో నాసిరకం సరుకులతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్యం దెబ్బతింటుంది. మండలకేంద్రంలోని ఐదు, మిగతా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు గత 15 రోజుల క్రితం సరఫరా అయిన పసుపు, కారం, పప్పులు రంగు మారి కనిపిస్తున్నాయి. తడిసిన ఉప్పు బెడ్డలు, చిన్నరాళ్లతో కూడిన దొడ్డు బియ్యం దర్శనమిస్తున్నాయి. ఒక్కొక్క ట్రేలో నాలుగైదు పగిలిన కోడిగుడ్లు, అప్పుడప్పుడు కుళ్లినవి ఉంటున్నాయి. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తినకుండా వెనుదిరుగుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సరుకుల నాణ్యతపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.



సరఫరా అయిన నాసిరకం సరుకులు

ఏజెన్సీబంద్ విజయవంతం చేయండి



ఇచ్చోడ: మాట్లాడుతున్న నాయకులు

- కొలాం సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సోనేరావు



నినాదాలు చేస్తున్న కొలాం సేవా సంఘం నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: తొమ్మిది తెగల ఆదివాసీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న నిర్వహించే ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొడప సోనేరావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవనం ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బంద్‌లో ఆదివాసీ తొమ్మిది తెగలతోపాటు కొలాం సంఘాల నేతలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావు, గౌరవ అధ్యక్షుడు టేకం రాజు, కుమ్రం సూరు యువసేన జిల్లా అధ్యక్షుడు కుమ్ర రాజు పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ బిర్ద్‌గోండ్ తోటి సేవా సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం వారు మాట్లాడారు. ఏజెన్సీ లో ప్రత్యేక డీఎస్సీ జీవో నెంబర్ 3 అమలు చేయాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నైతం శేఖర్, నాయకులు పవన్, మారుతి, నరేందర్ పాల్గొన్నారు.

ఎదులాపురం: ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రూరల్ మండల అధ్యక్షుడు మేస్రం కేశవ్ కోరారు. జిల్లాకేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయిసెంటర్ సార్‌మేడీలు, ఆదివాసీ హక్కుల పోరాట సమితి పిలుపుమేరకు బంద్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నాయకులు రాము, దినేశ్, జాకు, సునీల్, గణేశ్, ఇంద్ర, ఉద్దవ్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన ఓ పేద కుటుంబానికి నేషనల్ సోల్జర్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు చేయూతనిచ్చారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సురేశ్ గత కొంత కాలంగా అనారోగ్యం బారినపడ్డాడు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. భార్యతోపాటు ఆరుగురు పిల్లలు ఉన్నారు. ఆ కుటుంబం ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని తెలుసుకుని సొసైటీ సభ్యులు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు వినోద్‌కుమార్, రాజేందర్, కరుణాకర్, సుధీర్, ప్రేమ్, విశాల్, రమేశ్, జైపాల్, దుర్గాప్రసాద్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాంసి: భీంపూర్ మండలం తాంసి(కె) గ్రామంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు వినోద్, అరవింద్, ప్రభాకర్, రైతులు నారాయణ, ఖాజా, దత్తు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి పరామర్శ



పరామర్శిస్తున్న శ్రీహరిరావు

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్నను నిర్మల్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు కె.శ్రీహరిరావు ఆదివారం పరామర్శించారు. ఇటీవల జోగు రామన్న సోదరుడు జోగు పోతారెడ్డి మృతిచెందాడు. దీంతో ఆయన జోగు రామన్న నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతిపట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సైన్స్‌తోనే దేశ అభివృద్ధి



మాట్లాడుతున్న సామల వీరన్న

ఆదిలాబాద్‌టౌన్: సైన్స్‌తోనే దేశ అభివృద్ధి సాధ్యమని రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి సామల వీరన్న అన్నారు. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక 5వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధి కోసం శాస్త్రీయ ఆలోచన పెంపొందించడం కోసం ఉపాధ్యాయులు, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు విద్యార్థులను చైతన్యవంతులను చేయాలన్నారు. లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్, పాఠశాల కరస్పాండెంట్ దేవేందర్ పటాస్కర్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్, కోశాధికారి కత్తి శ్రీధర్ బాబు, జిల్లా నాయకులు గంగన్న, సంజీవ రెడ్డి, ఊషన్న, ప్రమోద్, ఉమకాంత్, లింగారెడ్డి, వినోద్, సురేష్, స్వామి, ఉమామహేశ్వర్, రాకేశ్, సాంబయ్య, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా అధ్యక్షుడికి సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కాసర్ల శ్రీనివాస్‌ను జిల్లా కేంద్రంలో పలువురు సంఘ నాయకులు ఆదివారం సన్మానించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తు, ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు వీరేశ్ తదితరులు ఉన్నారు.

ఏఈఈ ఫలితాల్లో సత్తా



అపర్ణను, ఆమె తల్లిదండ్రులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన ఖ్యాతం అపర్ణ ఏఈఈ ఫలితాల్లో సత్తా చాటి మిషన్ భగీరథలో ఏఈఈగా ఉద్యోగం సాధించింది. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ఆదివారం వారి నివాసానికి చేరుకుని అపర్ణతోపాటు తల్లిదండ్రులు రమేశ్–వెంకటమ్మలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యపై పట్టు సాధిస్తే ఇలాంటి మరెన్నో విజయాలు అందిపుచ్చుకోవచ్చన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ బూటకమని పేర్కొన్నారు. వార్డు కౌన్సిలర్ భూమన్న, అశోక్ స్వామి, గోలి శంకర్, సాయి పాల్గొన్నారు.

బురద ఇలా..వెళ్లేదెలా?



యేసాపూర్ దారిలో బురదలో విద్యార్థులు

బజార్‌హత్నూర్: మండలంలోని ధరంపురి పంచాయతీ పరిధిలోని యేసాపూర్ గ్రామానికి వెళ్లేదా రి బురదమయంగా మారింది. ధరంపురి నుంచి 12 కి.మీ దూరాన ఉన్న ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. వర్షాకాలం వస్తే గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రానికి వెళ్లాలన్నా రైతులు, విద్యార్థులు గులాబ్‌తండా వరకు కాలినడకన బురదలో వెళ్లాల్సి ఉంది. అక్కడి నుంచి ఆటోలో మండల కేంద్రానికి చేరుకోవాలి. గ్రామ సమీపంలో గల కడెం నదిపై గల వంతెన గతేడాది కోతలకు గురైంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. భారీ వర్షాలకు కడెం నది పొంగడంతో వరద నీరు రోడ్డు చేరి బురదమయమవుతోంది. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి



యేసాపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. ఎవరైన అనారోగ్యం బారిన పడితే 108 అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు. గ్రామం నుంచి ఆటోలు ఉన్నా వర్షాలకు బురదలో దిగబడుతున్నాయి. గులాబ్‌తండా వరకు విద్యార్థులు, రైతులు కాలినడకన వెళ్లాలి. గ్రామస్తుల ఇబ్బందులపై ఎమ్మెల్యే, ఎంపీకి విన్నవించుకున్నాం. ఇప్పటికైన రోడ్డు సౌకర్యం కల్పించాలి.

– తగిరే ఉత్తం, యేసాపూర్

తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సంతోష్

ఎదులాపురం: ఓసీలపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న తీన్మార్ మల్లన్నపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఓసీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనగం సంతోష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్‌తో ఇతర కులాలు నష్టపోతున్నట్లు మల్లన్న దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. ఓసీ సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతం శివప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రఫుల్ వజే, సామ ఆశిష్‌రెడ్డి, గోపిడి నవీన్‌రెడ్డి, బోండ్ల శివకిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.